క్లుప్తంగా

మన్నవ పంచాయతీ సమస్యలపై విచారణ

పొన్నూరు: మండలంలోని మన్నవ గ్రామ పంచాయతీ సమస్యలపై మంగళవారం తెనాలి డివిజనల్ పంచాయతీ అధికారి స్వరూపారాణి విచారించారు. పంచాయతీలో అభివృద్ధి జరగడం లేదని, పారిశుద్ధ్య సమస్య, పైప్‌లైన్లకు మరమ్మతులు చేయక తాగునీరు కలుషితం అవుతోందని ఇటీవల జిల్లా కలెక్టర్‌కు గ్రామ పెద్దలు ఫిర్యాదు చేశారు. పాలకులు అందుబాటులో ఉండటం లేదని పేర్కొన్నారు. పంచాయతీ రికార్డులు, బ్యాంకు పుస్తకాలు, చెక్‌బుక్స్ కార్యాలయంలో ఉంచకుండా అక్రమాలకు పాల్పడ్డారని ఫిర్యాదులో ఆరోపించారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీవో పంచాయతీలో సమస్యలు, అక్రమాలపై సిబ్బందిని విచారించారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు



చేబ్రోలు: రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన చేబ్రోలు మండలం నారాకోడూరు వద్ద మంగళవారం చోటుచేసుకుంది. నారాకోడూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలో ద్విచక్ర వాహనంపై వెళ్తున్న ఇద్దరు వృద్ధులను కారు ఢీ కొట్టింది. ఈ సంఘటనలో నారాకోడూరు గ్రామానికి చెందిన జి.లక్ష్మి, సాంబయ్యలకు గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

శివాలయంలో వారాహి అమ్మవారి దర్శనం



గుంటూరు ఎడ్యుకేషన్: మల్లిఖార్జునపేటలోని గంగా భ్రమరాంబ సమేత మల్లిఖార్జునస్వామివారి దేవస్థానంలో వారాహి నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా మంగళవారం అమ్మవారు వారాహిమాతగా దర్శనమిచ్చారు. వారాహి నవరాత్రుల సందర్భంగా ప్రతి యేటా గంగా భ్రమరాంబ అమ్మవారిని వారాహిమాతగా విశేష అలంకరణలు చేస్తామని ఆలయ ప్రధాన అర్చకుడు చంద్రశేఖరశర్మ తెలిపారు. ఈసందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

శ్రీకృష్ణ లీలలుపై ఆధ్యాత్మిక ప్రవచనాలు



నగరంపాలెం: స్థానిక బృందావన్‌గార్డెన్స్ వేంకటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణం అన్నమయ్య కళ్యాణవేదికపై శ్రీ మద్భాగవతం దశమస్కంధం శ్రీకృష్ణలీలలుపై ఆధ్యాత్మిక ప్రవచనాలు మంగళవారం ప్రారంభమయ్యాయి. ఆలయ అధ్యక్షుడు సీహెచ్ మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు జ్యోతిప్రజ్వలనతో ప్రారంభించారు. బ్రహ్మశ్రీ మల్లాది కైలాసనాథ్ ప్రసంగిస్తూ యమున నదిని విషపూరితంగా వించిన కాళీయుడిని శిక్షించి, నదిని ప్రజోపయోగంగా శ్రీకృష్ణుడు మార్చారని అన్నారు. కాళీయుడు అనగా సర్పం రూపంలో ఉన్న రాక్షసుడు అని పేర్కొన్నారు. అంతేగాక నదులను, అడవులను, ప్రకృతి సంపదను అనేక రకాలుగా కలుషితం, విషమంగా చేసే వారందరూ కాళీయులేనని చెప్పారు. ప్రకృతి సంపదను పాడుచేసే వారందరూ పరమాత్ముని చేతిలో శిక్షకు గురవుతారని శ్రీకృష్ణలీలలో తెలుస్తోందని కైలాసనాథ్ భక్తులకు వివరించారు.

దళిత నాయకుడిపై చెయ్యి చేసుకున్న ఎస్ఐ

గుంటూరుఈస్ట్: అరండల్‌పేట పోలీసు స్టేషన్‌లో దళిత సంఘ నాయకుడిని ఎస్ఐ కులం పేరుతో దూషించి చెయ్యి చేసుకున్న ఘటన నిరసనకు దారి తీసింది. బాధితుడు నల్లపు నీలాంబరం తెలిపిన వివరాల ప్రకారం.. శారదాకాలనీలో నివసించే భీమ్ సంఘ సేవాదళ్ అధ్యక్షుడు నల్లపు నీలాంబరం ఇంట్లో పదిరోజుల క్రితం చోరీ జరిగింది. నీలాంబరం దీనిపై పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. మంగళవారం నీలాంబరం పోలీసు స్టేషన్‌కు వచ్చి ఎస్ఐ నాగరాజును కలిసి తాను ఇచ్చిన ఫిర్యాదుపై ఎంతవరకు చర్యలు తీసుకున్నారని అడిగాడు. ఇరువురి మధ్య వాగ్వివాదం చోటు చేసుకుంది. దీంతో ఎస్ఐ నాగరాజు కోపోద్రిక్తుడై కులం పేరుతో దూషించి నీలాంబరం చెంప మీద కొట్టాడు. దీంతో నీలాంబరం స్టేషన్ వరండాలో బైఠాయించి నిరసన తెలిపాడు.

పత్తిలో సస్యరక్షణ అవసరం

గుంటూరు రూరల్: నగర శివారులోని లాంఫాంలో ఉన్న ఏరువాక కేంద్రంలో మంగళవారం తాడికొండ నియోజకవర్గం ఫిరంగిపురం మండలం 113 తాళ్ళూరు, వేములూరిపాడు గ్రామాలకు చెందిన రైతులతో పత్తి సాగులో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై మల్టీ లొకేషన్ ఆడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్రం కోఆర్డినేటర్ డాక్టర్ ఎం. నగేష్, సీనియర్ శాస్త్రవేత్త (విస్తరణ విభాగం) డాక్టర్ ఎం. వెంకటరాములు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు కె. వీరభద్రరావు, పి. మాణిక్యాలరావులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఫోన్‌లో రైతులు అడిగిన ప్రశ్నలకు శాస్త్రవేత్తలు సమాధానాలు ఇచ్చారు. యాజమాన్య పద్ధతులను కూడా వివరించారు. రైతులు అడిగిన ప్రశ్నలు, శాస్త్రవేత్తల సమాధానాలు కింది విధంగా ఉన్నాయి...

1. ప్రశ్న: పత్తి పంటను ఎప్పటివరకూ విత్తుకోవచ్చు. ఆ సమయంలో ఏ ఎరువులు వాడాలి?
(రైతు: జి రమేష్‌బాబు, వేములూరిపాడు)
సమాధాన: పంటను నల్ల నేలలో జులై నుంచి ఆగస్టు వరకు విత్తుకోవాలి. నీటి సదుపాయం ఉన్న ఎర్ర నేలల్లో జూన్ మధ్య వరకు సంకర రకాలను విత్తుకోవాలి. అన్ని ప్రాంతాలకు సిఫారసు చేసిన భాస్వరం ఎరువులను ఒకేసారి ఆఖరి దుక్కిలో వేసి కలియ దున్నుకోవాలి. సిఫారసు చేసిన నత్రజని, పోటాష్ ఎరువులు మూడు భాగాలు చేసి విత్తిన 30, 60, 90 రోజులకు మొక్క మొదళ్లలో 7-10 సెంటీ మీటర్ల దూరంలో పాదులు తీసి వేసుకోవాలి.

2. ప్రశ్న: పంటను విత్తుకుని 20 రోజులైంది. తుంగ కలుపు నివారణకు మార్గాలు తెలియజేయండి.
(రైతు: ఆర్. లక్ష్మణ్, 113 తాళ్ళూరు)
సమాధానం: తుంగజాతి కలుపు నివారించేందుకు ప్రత్యేక కలుపు మందు ఏమీ లేదు. దీని నివారణకు వేసవిలో దుక్కులు చేసుకోవటంతోపాటు పంటలో అంతర కృషి ఎంతో అవసరం. కూలీలతో కలుపు తీసేయించుకోవాలి. ఖరీఫ్‌లో వర్షాలు ఎక్కువగా ఉండి అంతర కృషి కుదరనప్పుడు ఎకరానికి ఒక లీటరు పెరాక్వాట్ 24 శాతం ఎస్ఎల్ మందును 200 లీటర్ల నీటిలో కలిపి పంట మీద పడకుండా వరుసల మధ కలుపుపై మాత్రమే పడేలా పిచికారీ చేసుకోవాలి.



ఫోన్‌లో రైతుల ప్రశ్నలకు సమాధానాలు చెబుతున్న ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు

3. ప్రశ్న: పంట విత్తుకుని 15 రోజులు అవుతోంది. పంటలో చంచలాకు, వెదల్పాకు కలుపు, గడ్డిజాతి కలుపు నివారణకు మార్గాలు తెలపండి.
(రైతు: ఎ.శివరామయ్య, 113 తాళ్ళూరు)
సమాధానం: పంటను విత్తుకున్న వెంటనే లేదా ఒకటి రెండు రోజుల్లో 1.0 నుంచి 1.3 లీటర్ల పెండిమిథాలిన్ 38.7 శాతం (స్టాంప్ ఎక్స్‌ట్రా)ను 200 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. విత్తుకుని 15 రోజులైతే 25-30 రోజుల వరకు అంతర కృషి చేసి కలుపును నివారించుకోవాలి. వర్షాలు ఎక్కువగా ఉంటే అంతర కృషి అవకాశం లేకుంటే వెడల్పు ఆకు కలుపు నివారణకు ఎకరాకు 250 మిల్లీ లీటర్లు పైరిథయోబాక్ సోడియం 10 శాతం (హీట్‌వీడ్, థీమ్)ను, గడ్డిజాతి కలుపు నివారణకు 400 మిల్లీ లీటర్ల క్విజలోఫాప్ పి ఇథైల్ 5 శాతం (టర్గాసూపర్)ను 200 లీటర్ల నీటికి కలిపి పిచికారీ చేసుకోవాలి.

4. ప్రశ్న: పత్తిలో గులాబీరంగు పురుగుల నివారణకు ప్రస్తుతం తీసుకోవాల్సిన జాగ్రత్త చర్యలు తెలియజేయండి.
(రైతు: కె. నాగసురేష్, 113 తాళ్ళూరు)
సమాధానం: గులాబీ రంగు పురుగుల నివారణకు పంటమార్పిడి పద్ధతిని రెండు, మూడు సంవత్సరాలకు ఒకసారి విధిగా పాటించాలి. తక్కువ కాల పరిమితి రకాలను ఎంపిక చేసుకుని సకాలంలో విత్తుకోవటం ద్వారా లీ పురుగుల ఉధృతిని తగ్గించుకోవచ్చు. పొలం చుట్టూ తుత్తురుబెండ, ఉమ్మెత్త లాంటి ఆతిథ్యమిచ్చే కలుపు మొక్కలు లేకుండా చూసుకోవాలి. పంట దగ్గరలో బెండ పంట లేకుండా చూసుకోవాలి. పంట కాలంలో సమగ్ర యాజమాన్య పద్ధతులు చేపట్టటం ముఖ్యంగా సేంద్రియ ఎరువులు, నత్రజని సమతుల్యత పాటించి ఈ పురుగుల ఉధృతిని తగ్గించవచ్చు. పంటను విత్తుకున్న 45 రోజుల నుంచి గులాబీ రంగు పురుగు ఉనికిని గమనించటానికి ఎకరానికి 4 లింగాకర్షక బుట్టలను అమర్చుకోవాలి. ఒక ప్రాంతంలో పత్తిని దఫాలుగా కాకుండా ఒకేసారి విత్తటం ద్వారా పురుగు బెడద తగ్గించవచ్చు. పత్తి మోళ్లను పొలంలో లేదా ఇళ్ల వద్ద వంట చెరకుగా వాడేందుకు నిల్వ చేయకూడదు. నీటి వసతి ఉన్న చోట రెండో పంటగా ఆరుతడి పంటలను సాగు చేసుకోవాలి.

5. ప్రశ్న: పత్తి అధికంగా ఎత్తు పెరగకుండా ఎటువంటి జాగ్రత్తలు పాటించాలి?
(రైతు: షేక్ మస్తాన్, 113 తాళ్ళూరు)
సమాధానం: సాగునీటి వసతి ఉన్న పరిస్థితుల్లో అధిక వర్షాలతోపాటు నత్రజని ఎరువులు అధికంగా వినియోగించటం వల్ల పంటలో ఎక్కువగా గొడుగు కొమ్మలు, కాయ కొమ్మలు ఏర్పడతాయి. దీని ద్వారా మొక్కలో తయారయ్యే పిండి పదార్థాలు ఎక్కువగా కొమ్మల అభివృద్ధికి సరిపోతాయి. పూత, పిందె కాయలు రాలటం కనిపిస్తుంది. నివారణకు సైకోసెల్‌ను 60 పీపీఎం మోతాదులో పిచికారీ చేస్తే మొక్కల్లో అదనపు శాఖీయ పెరుగుదల ఆగిపోయి, పిండి పదార్థాలు పూత, పిందె అభివృద్ధికి ఉపయోగపడతాయి. ప్రతి మొక్కకు 15 నుంచి 18 పక్క మొక్కలు వచ్చినపుడు లేదా పత్తి విత్తుకుని 70 రోజులకు మొక్క మీటరు కంటే ఎక్కువ ఎత్తు పెరిగినప్పుడు చివర్లను తుంచాలి. దీనివల్ల పెరుగుదల తగ్గి పక్క కొమ్మలు ఎక్కువై కాపు వస్తుంది.

6. ప్రశ్న: పత్తిలో వేపపిండి, ట్రైకోడెర్మావిరిడిని కలిపి ఎలా వాడుకోవాలి?
(రైతు: షేక్ మస్తాన్‌వలి, 113 తాళ్ళూరు)
సమాధానం: పంటలో 90 కిలోల పశువుల ఎరువు, 10 కిలోల వేపపిండికి 2 కిలోల ట్రైకోడెర్మా శిలీంధ్రపు పొడిని కలిపి 12-15 రోజులు నీడలో ఉంచాలి. ఈ శిలీంధ్రం వృద్ధి చెందిన తరువాత ఆఖరు దుక్కిలో చల్లుకుని భూమిలో కలియ దున్నుకోవాలి.

ఐపీసీలో చిప్స్ కళాశాలకు రెండు అవార్డులు

గుంటూరు రూరల్: ఇటీవల హైదరాబాద్ హైటెక్స్ ఎగ్జిబిషన్ గ్రౌండ్స్‌లో జరిగిన 73వ ఇండియన్ ఫార్మాస్యూటికల్ కాంగ్రెస్ (ఐపీసీ)లో తమ కళాశాలకు రెండు అవార్డులు రావటం గర్వంగా ఉందని చేబ్రోలు హనుమయ్య ఫార్మసీ కళాశాల (చిప్స్) ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్ తెలిపారు. మంగళవారం చౌడవరం గ్రామంలోని కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల అధ్యాపకులు సమర్పించిన పరిశోధన పత్రాలకు వివిధ విభాగాల్లో ప్రథమ, ద్వితీయ బహుమతులు వచ్చినట్లు తెలిపారు. ఫార్మా కాలజీ విభాగంలో ఆర్. సాయిరేష్మ సమర్పించిన పరిశోధన పత్రానికి ప్రథమ, ఫార్మాకాగ్నెసీ విభాగంలో డాక్టర్ పి. విజేత సమర్పించిన పరిశోధన పత్రానికి ద్వితీయ బహుమతి లభించినట్లు పేర్కొన్నారు. ఐపీసీలో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా రంగ నిపుణులు, ప్రతినిధులు సుమారు 11 వేల మందికిపైగా పాల్గొన్నారని తెలిపారు. 2,500 మందికిపైగా పరిశోధన పత్రాలను సమర్పించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యక్షుడు డాక్టర్ ఆర్ శ్రీనివాస్, డాక్టర్ సీఎస్ శ్రీనివాస్, ఆర్ గోపాలకృష్ణలు అవార్డులు పొందిన అధ్యాపకులను అభినందించారు.



అవార్డులు సాధించిన అధ్యాపకులను అభినందిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్ విద్యాధర్

అవగాహనతోనే అంటువ్యాధులు దూరం

పెదకాకాని: అంటువ్యాధులపై అవగాహన పెంచుకుంటే వాటి బారిన పడకుండా చూసుకోవచ్చని జల్‌జీవన్ మిషన్ ప్రాజెక్ట్ మేనేజర్ పి.కిరణ్‌కుమార్ అన్నారు. పెదకాకాని మండలంలోని వెనిగండ్ల జిల్లా పరిషత్ పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు చేతుల శుభ్రత, డయేరియాపై అవగాహన సదస్సు నిర్వహించారు. చేతులు పరిశుభ్రంగా కడుక్కునే విధానాన్ని తెలిపారు. అనంతరం గ్రామంలో విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. డయేరియా నివారణ చర్యలు వివరిస్తూ కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో భాగంగా తాగునీటిని పరీక్షించారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించి వైద్యులతో మాట్లాడారు. డయేరియా వంటి వ్యాధులకు సంబంధించి చికిత్స, వైద్యం అందించేందుకు చేసిన ఏర్పాట్లపై చర్చించారు. ఈ కార్యక్రమంలో జల్‌జీవన్ మిషన్ జిల్లా కోఆర్డినేటర్లు తేజ్ సంగీత్, షఫీ, సీహెచ్‌వో జ్యోత్స్న, పాఠశాల ప్రధానోపాధ్యాయుడు తిరుపతిరావు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

హనుమంత్ ప్రణీత్‌పై కేసులు

తాడేపల్లిరూరల్: మహిళలను, పిల్లలను లైంగిక వ్యాఖ్యలు చేస్తున్న యూట్యూబర్ హనుమంత్ ప్రణీత్‌పై కేసులు నమోదు చేయాలి ఐద్వా రాష్ట్ర కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు బి.ప్రభావతి, డి.రమాదేవి మంగళవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. హనుమంత్ ప్రణీత్ యూట్యూబ్‌లో వివిధ రకాల సోషల్ మీడియా దృశ్యాలపై అసభ్య వ్యాఖ్యాలు చేయడం, కామెడీ పేరిట ప్రసారం చేయడం నేరమని, ప్రణీత్ మరియు అతని సహచరులపై పోక్సో మరియు లైంగిక వేధింపు కేసు నమోదు చేసి విచారణ చేపట్టి కఠినంగా శిక్షించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరుతున్నామని వారు ఆ ప్రకటనలో తెలిపారు.

అంగన్‌వాడీల ధర్నాను జయప్రదం చేయండి

పిడుగురాళ్ల: గురజాల ఆర్‌డీవో కార్యాలయం వద్ద జరగనున్న అంగన్‌వాడీల ధర్నా కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి సీఐటీయూ, అంగన్‌వాడీ కార్యకర్తల నాయకులు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ మండల కార్యదర్శి తెలగపల్లి శ్రీనివాసరావు మాట్లాడుతూ అంగన్‌వాడీ కార్యకర్తలు 42 రోజుల సమ్మె సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని, ఆశా కార్యకర్తలు ఇచ్చిన హామీలకు జీవోను వెంటనే ఇవ్వాలని, మధ్యాహ్న భోజన కార్మికులకు మెనూ ఛార్జీలు, వేతనాలు పెంచడం వంటి పలు డిమాండ్ల సాధన కోసం ఈ నెల 10వ తేదీన ఉదయం 10 గంటలకు గురజాల ఆర్‌డీవో కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు గుర్తుచేశారు. ప్రతి ఒక్కరు హాజరై ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తెలిపారు. అనంతరం వినతిపత్రాన్ని పిడుగురాళ్ల ఐసీడీఎస్ ప్రాజెక్టు సిబ్బందికి అందజేశారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు రమాదేవి, శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.



పిడుగురాళ్ల ఐసీడీఎస్ అధికారులకు వినతిపత్రం అందిస్తున్న సీఐటీయూ నాయకులు

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని హెచ్చరిక

కారెంపూడి: మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని తల్లిదండ్రులను కారెంపూడి ఎస్ఐ కె.అమీర్ హెచ్చరించారు. మితిమీరిన వేగం వల్ల రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తుచేశారు. అతివేగంతో వాహనాలు నడపొద్దని విజ్ఞప్తి చేశారు. స్థానిక బస్టాండ్ సెంటర్‌లో మంగళవారం సాయంత్రం ఆయన వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా నిబంధనలు పాటించని వాహన చోదకులకు జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకున్న వారిని అలా చేయవద్దని హెచ్చరించారు. లారీలు, ట్రాలీలలో కూలీలు పనులకు వెళ్లేటప్పుడు ప్రయాణం చేయొద్దని కోరారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపొద్దని, మైనర్లకు తల్లిదండ్రులు బైక్ నడిపే అవకాశం కల్పించవద్దని ఎస్ఐ విజ్ఞప్తి చేశారు.



వాహనదారుడిని వివరాలు అడుగుతున్న ఎస్ఐ అమీర్

ఎరువుల దుకాణాలలో ఆకస్మిక తనిఖీలు

తెనాలిరూరల్: తెనాలిలోని ఎరువుల దుకాణాలను ఇంటర్నల్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్ మంగళవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీ చేశారు. స్థానిక మారిస్‌పేటలోని ఎరువుల కొట్ల బజారులోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించగా మణికంఠ ఎంటర్‌ప్రైజెస్ దుకాణంలో సరైన ధ్రువపత్రాలు లేకపోవడం, గోడౌను నిబంధనలకు అనుగుణంగా లేకపోవడంతో సుమారు రూ.39,07,022 విలువైన 219.20 మెట్రిక్ టన్నుల ఎరువుల అమ్మకాలను అధికారులు నిలిపివేశారు. తనిఖీల్లో స్క్వాడ్ ఏడీఏ కె.నాగేశ్వరరావు, విజిలెన్స్ సీఐ సి.మాణిక్యరావు, తెనాలి ఏడీఏ ఎన్.ఉషారాణి, గుంటూరు టెక్నికల్ ఏవో బి.గౌతమ్ ప్రసన్నకుమార్, తెనాలి మండల వ్యవసాయాధికారి జి.ప్రేమ్‌సాగర్ పాల్గొన్నారు.



దుకాణంలో తనిఖీలు చేస్తున్న ఇంటర్నల్ డిస్ట్రిక్ట్ స్క్వాడ్

సురక్షిత కాన్పు కోసం కృషి

ఫిరంగిపురం: గర్భిణులు సురక్షితమైన కాన్పు కోసం ఆరోగ్య సిబ్బంది కృషి చేయాలని వైద్యురాలు శ్వేత అన్నారు. మండల కేంద్రంలోని హెల్త్‌వెల్‌నెస్ సెంటర్‌లో మంగళవారం ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా 28 మంది గర్భిణులకు షుగర్, బీపీ, ఈసీజీ ,హెచ్‌బీ పరీక్షలు చేసి మందులు అందజేశారు. డాక్టర్ శ్వేత మాట్లాడుతూ గర్భిణులకు పరీక్షలు చేయడం ద్వారా ప్రమాదకర లక్షణాలు ఉన్నవోలేవో గుర్తించి అవసరమైన వారిని పరీక్షలు కోసం పెద్ద వైద్యశాలకు రిఫర్ చేస్తామన్నారు. అవసరమైన వారికి స్కానింగ్ చేస్తామని చెప్పారు. ఆరునెలల గర్భిణులు తప్పనిసరిగా ఈసీజీ పరీక్షలు చేయించుకోవాలని దానిని ప్రతి నెల గ్రామానికి వచ్చే 104 వాహనంలో చేస్తారని తెలిపారు. తల్లిబిడ్డ సురక్షితంగా ఉండేందుకు కృషి చేయాలన్నారు. తప్పనిసరిగా పోషక విలువలతో కూడిన ఆహారం తీసుకోవాలని చెప్పారు. గ్రామాల్లో కాన్పు కోసం ప్రభుత్వవైద్యశాలకు తీసుకు వెళ్లేందుకు తల్లీబిడ్డ ఎక్స్‌ప్రెస్ వాహనం ఉపయోగకరంగా ఉండటమే కాకుండా కాన్పు తరువాత కూడా వారిని ఇంటివద్దకు క్షేమంగా చేరుస్తారని చెప్పారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ వెంకటరమణ, హెచ్‌వీ అన్నమేరి పాల్గొన్నారు.



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు శ్వేత

లారీలకు జరిమానా

ఫిరంగిపురం: సరైన ధ్రువపత్రాలు లేకుండా క్వారీ రాళ్లతో వెళ్తున్న లారీలను మైనింగ్ అధికారులు నిలిపివేసి జరిమానా విధించారు. ఫిరంగిపురం నుంచి పేరేచర్ల రాళ్లలోడుతో వెళ్తున్న నాలుగు లారీలను సోమవారం రాత్రి మైనింగ్ అధికారి శివాజి తనిఖీ చేశారు. సరైన ధ్రువపత్రాలు లేకపోవడంతో వాటిని పోలీస్ స్టేషన్ సమీపంలోని బస్టాండ్ వద్ద నిలిపివేశారు. వారికి జరిమానాగా రూ.15,100 విధించినట్లు ఆయన తెలిపారు.



ముగిసిన నాటికల పోటీలు



ఇంద్రప్రస్థం నాటికకు బహుమతిని అందజేస్తున్న ఈదర హరిబాబు




'కపిరాజు' నాటికలో సన్నివేశం

- 'ఇంద్రప్రస్థం' నాటికకు బహుమతుల పంట
- ఉత్తమ ప్రదర్శన సహా ఐదు బహుమతులు

తెనాలి: రోటరీ కళాపరిషత్, ఈదర రామారావు చారిటబుల్ ట్రస్ట్-తెనాలి సంయుక్త ఆధ్వర్యంలో స్థానిక తెనాలి రామకృష్ణ కవి కళాక్షేత్రంలో గత రెండు రోజులుగా జరిగిన రాష్ట్ర స్థాయి ప్రథమ ఆహ్వాన నాటికల పోటీలు మంగళవారం రాత్రి ముగిశాయి. ఉత్తమ ప్రదర్శనగా అభినయ ఆర్ట్స్, గుంటూరు వారి 'ఇంద్రప్రస్థం' నాటిక ప్రథమ బహుమతిని అందుకుంది. ఇదే నాటికకు ఉత్తమ రచన, ఉత్తమ దర్శకత్వం, ఉత్తమ రంగాలంకరణ, ఉత్తమ క్యారెక్టర్ నటుడు బహుమతులు వరించటం విశేషం. చైతన్యభారతి, కరీంనగర్ వారి 'స్వప్నం రాల్చిన అమృతం' నాటిక ద్వితీయ ఉత్తమ ప్రదర్శన, న్యూ స్టార్ మోడ్రన్ థియేటర్, విజయవాడ వారి 'కపిరాజు' తృతీయ ఉత్తమ ప్రదర్శన బహుమతిని గెలుచుకున్నాయి. అందిన ఆకాశంలో నటించిన ఎస్ఎన్ బాషా ఉత్తమ నటుడిగా, జ్యోతిరాజ్ భీశెట్టి ఉత్తమ నటిగా బహుమతులు గెలుచుకున్నారు. న్యాయ నిర్ణేతలుగా వి.వేణుగోపాల్, నుసునం నాగభూషణం, గోపరాజు విజయ్ వ్యవహరించారు. ముగింపు సభలో ముఖ్య అతిథిగా హాజరైన మాజీ ఎమ్మెల్యే, ఎన్టీఆర్ కళాపరిషత్, ఒంగోలు వ్యవస్థాపకుడు ఈదర హరిబాబు చేతులమీదుగా బహుమతులు అందజేశారు. రోటరీ క్లబ్, తెనాలి అధ్యక్షుడు ఈదర శ్రీనివాసరావు అధ్యక్షత వహించారు. మాజీ మంత్రి నన్నపనేని రాజకుమారి, ట్రస్ట్ అధ్యక్షుడు ఈదర వెంకట పూర్ణచంద్, క్లబ్ కార్యదర్శి దేవయజనం మురళీకృష్ణ, పట్టణ రంగస్థల కళాకారుల సంఘం అధ్యక్షురాలు బుర్రా జయలక్ష్మి, కార్యనిర్వాహక అధ్యక్షుడు గరికపాటి సుబ్బారావు, డీఎల్ కాంతారావు, బత్తుల వెంకటేశ్వరరావు, నల్లూరి వెంకటేశ్వరరావు, డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు పాల్గొన్నారు. సభకు ముందు న్యూ స్టార్ మోడరన్ ఆర్ట్స్ థియేటర్, విజయవాడ వారి 'కపిరాజు' నాటికను ప్రదర్శించారు. రచన, దర్శకత్వం డాక్టర్ ఎంఎస్ చౌదరి. చివరగా అమృత లహరి థియేటర్ ఆర్ట్స్, గుంటూరు వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటికను ప్రదర్శించారు. గంటి రాజేశ్వరి మూలకథను తాళాబత్తుల వెంకటేశ్వరరావు నాటకీకరించగా, ప్రముఖ రంగస్థల నటీమణులు అమృతవర్షిణి, లహరి దర్శకత్వం వహించారు.

మణిద్వీప వాసినీ పూజలు



తెనాలి: ఆర్టీసీ బస్‌స్టేషన్ సమీపంలోని ప్యారడైజ్ గృహ సముదాయంలో ప్రముఖ ఆధ్యాత్మిక సేవకురాలు, భక్తి కీర్తనల గాయని శారద చలపతి ఆధ్వర్యంలో మంగళవారం మణిద్వీప వాసినీ విశేష పూజలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆషాఢ మాసంలో వారాహీ నవరాత్రులు సందర్భంగా అమ్మవారిని శాకంబరీ రూపంలో అలంకరించి సేవిస్తారు. ఉదయం నుంచి అమ్మవారికి అభిషేకం, అర్చనలు, శ్రీ సూక్త, పురుష సూక్త విధానంలో పూజలు నిర్వహించారు. భవాని, బెజ్జంకి నాగమణి, సుశీలమ్మ, జ్యోతి, సుధ, పద్మజ, సునీల్, పద్మావతి, స్వరూప, సామ్రాజ్యం, ఎన్వీ యోగ కన్వీనర్ ముద్దాబత్తుని రమణయ్య పాల్గొన్నారు. శారద చలపతిని సత్కరించారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలి

తెనాలిరూరల్: ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించేలా చూడాలని ప్రిన్సిపల్ సీనియర్ సివిల్ జడ్జి ఎస్.శ్రీధర్ అన్నారు. తెనాలి మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో పోలీసులు, రవాణా శాఖ అధికారులతో స్థానిక కోర్టుల ప్రాంగణంలో న్యాయమూర్తులు మంగళవారం సమావేశమై వాహన చట్టాలు, రహదారి భద్రతపై అవగాహన కల్పించారు. ద్విచక్ర వాహనాలపై ఇద్దరు మాత్రమే వెళ్లేలా నిబంధనలు ఉన్నాయని, ముగ్గురు, నలుగురు వెళుతుండడంపై అలక్ష్యంగా వ్యవహరించవద్దన్నారు. అలాగే నిబంధనలకు విరుద్ధంగా వాహనాల సైలెన్సర్లు మార్చి శబ్ద కాలుష్యానికి కారణమవుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని సూచించారు. జూనియర్ సివిల్ జడ్జి పవన్ కుమార్ మాట్లాడుతూ పోలీసు సిబ్బంది కొరత ఉన్నా హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై ప్రజలకు పూర్తి స్థాయిలో అవగాహన వచ్చేలా చర్యలు తీసుకోవాల్సిన అవసరముందన్నారు. ప్రమాదాలను అరికట్టటమే లక్ష్యంగా పని చేయాలన్నారు. లైసెన్సు కోసం వచ్చే వారికి హెల్మెట్ ధారణ ఆవశ్యకతపై అవగాహన కల్పిస్తున్నట్టు మోటారు వాహన ఇన్‌స్పెక్టర్ టి.రాఘవరావు తెలిపారు. వారానికి ఒక స్టేషన్ పరిధిలో హెల్మెట్ ఆవశ్యకతపై అవగాహన కార్యక్రమాలు చేపడతామని వన్ టౌన్ ఎస్ఐలు కరిముల్లా, కోటేశ్వరరావు చెప్పారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, చుండూరు, కొల్లూరు, దుగ్గిరాల, కొల్లిపర పోలీసులు, పారాలీగల్ వలంటీర్లు, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ పర్యవేక్షకుడు మహబూబ్ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి శ్రీధర్

కార్పొరేషన్ స్కూళ్లలో ఉపాధ్యాయులను నియమించండి

గుంటూరు ఎడ్యుకేషన్: నగరపాలకసంస్థ ఉన్నత పాఠశాలల్లో అవసరమైన సబ్జెక్టు ఉపాధ్యాయులను డిప్యూటేషన్‌పై నియమించాలని నోబుల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బి.హైమారావు డిమాండ్ చేశారు. మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి కార్యాలయంలో డీఈఓ పి.శైలజకు అసోసియేషన్ గుంటూరు జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఉపాధ్యాయ సమస్యలను విన్నవించారు. హైమారావు మాట్లాడుతూ అప్‌గ్రేడ్ అయిన హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయ పోస్టులను మంజూరు చేయడంతో పాటు సీనియార్టీ జాబితాను అప్‌డేట్ చేయాలన్నారు. నగరపాలకసంస్థ ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థి, ఉపాధ్యాయుల నిష్పత్తి ప్రకారం పరిశీలన చేసి మిగులు ఉపాధ్యాయులను ఉన్నత పాఠశాలల్లో డిప్యూటేషన్ పద్ధతిలో నియమించాలని కోరారు. డీఈఓను కలసిన వారిలో నోబుల్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు షేక్ అబ్దుల్ ఖలీల్, ఎన్వీ జగదీష్‌కుమార్, ఆర్థిక కార్యదర్శి జి.అంథోనీబాబు, ప్రధానోపాధ్యాయులు ఎం.శ్రీనివాసరావు, పి.శ్రీనివాసరావు, షేక్ జిలానీబాషా, వై.వీరబాబు, పి.రమేష్, నగర నాయకుడు హరగోపాల్, లలిత్‌బాబు ఉన్నారు.